క్లుప్తంగా

ఆలయంలో ద్వారబంధం ఏర్పాటు


ఉమ్మలాడ శ్రీ దేవితల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన ద్వారబంధం

మునగపాక : మండలంలోని ఉమ్మలాడలో గల శ్రీదేవి తల్లి ఆలయంలో ఆదివారం ద్వారబంధం ఏర్పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. దీనిలో భాగంగా గ్రామస్తుల నడుమ ద్వారబంధం నెలకొల్పారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పల్లె అప్పలనాయుడు, ఇతర పాలకవర్గ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు.

సీఐ బదిలీ


బదిలీ అయిన సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : స్థానిక పోలీసు స్టేషన్ సీఐ పి.అప్పలరాజు బదిలీ అయ్యారు. ఇక్కడి నుంచి చోడవరం పోలీసు స్టేషన్‌కు అధికారులు బదిలీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈయన సీఐగా 2022 సెప్టెంబర్‌లో ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అన్ని పార్టీల నాయకులతోను సత్సంబంధాలు ఏర్పరచుకుని, అందరి మన్ననలు పొందారు.

గంగాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


గంగాలమ్మ తల్లి గుడిలో పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక : మండలంలోని మూలపేట గంగాలమ్మ తల్లి గుడి ప్రారంభోత్సవంలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలపేట గ్రామస్తులంతా కలశాలతో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన


కశింకోటలో కురుస్తున్న వర్షం

తుమ్మపాల: మండలంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మబ్బులు పట్టి, చీకటి మయంగా మారింది. భారీ ఈదురు గాలులతో ప్రారంభమైన వర్షం సుమారు గంటపాటు దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఎక్కడికక్కడ రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు దగ్గరలో తలదాచుకునేందుకు వాహనాలను రోడ్డుపైనే వదిలి పరుగులు తీశారు. కొన్ని చోట్ల చెట్లు నేలకొరిగాయి. రోడ్లపై వర్షపు నీరు ప్రవాహంలా మారింది. ఎండుతున్న వరినారుకు ఈ వర్షం జీవం పోస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వరి పంటలపై నమ్మకాన్ని కోల్పోతున్న రైతుల్లో ఆశలు చివురించాయి. మండలంలో ఇటీవల విరివిగా వేసిన సరుగుడు, యూకలిప్టస్ మొక్కలకూ ఈ వర్షంతో ప్రాణం పోసినట్టయింది. అయితే దమ్ములకు సరిపడా వర్షం కురవాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

కశింకోట: ఆదివారం సాయంత్రం కశింకోటలో మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి మండుతున్న ఎండకు ఇబ్బంది పడ్డ ప్రజలకు సాయంత్రం చల్లని ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రధానంగా పెళ్లిళ్ల సీజన్ కావడంతో కల్యాణ మండపాల్లో కాకుండా ఇళ్ల వద్ద వివాహాలు పెట్టుకున్న వారు వేదికలు, షామియానాలు తడిసి ఇబ్బందిపడ్డారు. మండల గ్రామాల్లో కూడా చిన్న పాటి వర్షం కురిసింది.

రంగుల వేడుక అనుబంధాల ప్రతీక

- అన్నాచెల్లెళ్ల బంధాన్ని ప్రపంచానికి చాటే రాఖీ పండగ నేడు
- రాఖీల అమ్మకాలతో కిటకిటలాడుతున్న మార్కెట్లు



ఆధునిక కాలంలో గొప్పగా చెప్పుకుంటున్న రాఖీ ప్రస్తావన పురాణ కాలం నుంచే ఉంది. ఆత్మీయతను చాటేందుకు, రక్షణ కోరేందుకు రాఖీ ఒక చక్కటి ఆధారంగా నిలుస్తోంది. అన్నాచెల్లెళ్ల బంధానికి నిదర్శనంగా నిలిచే రాఖీ పండగను అన్ని ప్రాంతాల వారు గొప్పగా చేసుకుంటారు. వివిధ రకాల రాఖీలతో మార్కెట్లు కిటకిటలాడుతుంటాయి. సాధారణ ధరల నుంచి అతి భారీ ధరల రాఖీలు కూడా మార్కెట్లో లభ్యమవుతుంటాయి. రాఖీ వేడుక సందర్భంగా మార్కెట్లు.. పిల్లలు, యువతతో కిటకిటలాడుతున్నాయి.


సోదరులకు రాఖీ కడుతున్న అక్కచెల్లెళ్లు (ఫైల్)


యలమంచిలి పట్టణంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

యలమంచిలి రూరల్ : అన్నదమ్ములుంటే చెల్లెళ్లకు కొండంత ధైర్యం. సోదరిలను మించిన స్నేహితులు అన్నదమ్ములకు ఉండరు. అందుకే ఒకరికొకరు రక్ష అంటూ రాఖీ పౌర్ణమి రోజున అన్నదమ్ములకు ఆడపిల్లలు రాఖీలు కట్టడం ఆచారంగా వస్తోంది. ఆగస్టు 19 సోమవారం రాఖీ పండగను పల్లెల నుంచి పట్టణాల వరకూ అందరూ ఎంతో సంబరంగా జరుపుకోవడం కోసం సమాయత్తమవుతున్నారు. శ్రావణ పౌర్ణమి రోజునే రాఖీ పౌర్ణమిగా, జంధ్యాల పౌర్ణమిగా, హయగ్రీవ జయంతిగా జరుపుకోవడం అనాది నుంచి ఆచారంగా వస్తోంది.

ఆకర్షణీయమైన రాఖీ అమ్మకాలు..

యలమంచిలి పట్టణంలోని అనేక షాపుల్లో రాఖీల అమ్మకాలు జోరందుకున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా రాఖీలు విక్రయించేందుకు వ్యాపారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆకర్షణీయమైన రాఖీలు అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్నాయి. రూ. 30 నుంచి రూ.1000 వరకూ రాఖీలు విక్రయిస్తున్నారు. వెండి రాఖీలను కొందరు కొనుగోలు చేస్తున్నారు.రాఖీ పండగ కూడా పలువురు వ్యాపారులకు ఉపాధినిస్తుందనే చెప్పాలి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రాఖీలు విక్రయించే షాపులన్నీ రద్దీగా కన్పించాయి. కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు వ్యాపారులు తమ దుకాణాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక రాయితీలు కూడా ఇస్తున్నారు. పలువురు రాఖీల కొనుగోలుకు వస్తుండటంతో దుకాణాల వద్ద సందడి నెలకొంది.

నక్కపల్లి : మహా బలవంతుడైన బలి చక్రవర్తిని కట్టిపడేసిన విష్ణుశక్తి చేత నిన్ను బంధిస్తున్నాను.. ఓ రక్షా బంధనమా.. నీవు చలింపకు అంటూ బలి చక్రవర్తి భార్య విష్ణుమూర్తికి రాఖీ కట్టిందని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇంద్రుని భార్య శచీదేవి ఈ రక్షాబంధనాన్ని పరమేశ్వరునికి కట్టినట్టు మహాభారతం ద్వారా తెలుస్తోంది. చరిత్ర ప్రకారం అయితే పురుషోత్తముడి భార్య అలెగ్జాండర్ చక్రవర్తికి రక్షా బంధనం కట్టినట్లు ఉంది. ఈ రాఖీ సాంప్రదాయం కుటుంబ బాంధవ్యాన్ని పెంపొందిస్తోంది. స్త్రీ శక్తి స్వరూపిణి. ఇంటి ఆడపడుచు తన క్షేమాన్ని కోరుతూ కట్టే తోరణమే రక్షా బంధనం. ఈ రక్షా బంధనం దైవికమైన శక్తితో కూడినది. ఇదే రోజును శ్రావణ పౌర్ణమిగా పిలుస్తారు. శ్రీమన్నారాయణుడు హయగ్రీవునిగా అవతరించాడు. కాబట్టి ఈ రోజున హయగ్రీవుని కూడా పూజిస్తారు. రాఖీ కట్టడం వల్ల పట్టుదల, ఆత్మస్థైర్యం కలిగి విజయం లభిస్తుందని నమ్మకం. ఈ రోజును జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. బ్రాహ్మణులు ఈ రోజున యజ్ఞోపవీతం ధరించి వేదపఠనం ప్రారంభిస్తారు.


అమ్మకానికి సిద్ధం చేసిన రకరకాల రాఖీలు

ఎక్కడ చూసినా రాఖీల కోలాహలమే..

రాఖీ పండగను పురస్కరించుకుని దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. రంగు రంగులు, వివిధ మోడళ్లతో కూడిన రాఖీలను మార్కెట్లో విక్రయిస్తుండటంతో కొనుగోలు చేసేందుకు పిల్లలు, యువత పోటీ పడుతున్నారు. దీంతో దుకాణాలన్నీ రద్దీగా ఉన్నాయి. సామాన్యులకు అందుబాటులో ఉన్న రాఖీలతో పాటు ఖరీదైనవి కూడా జోరుగా విక్రయిస్తున్నారు.

ఘనంగా సత్యసాయి భజన మండలి వార్షికోత్సవం


రక్తదానం చేస్తున్న దాత

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేటలో ఆదివారం శ్రీ సత్యసాయి భజన మండలి 14వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సత్యసాయి బాబాను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 30 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. వేడుకలను సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి బాబా భజన మండలి అధ్యక్షుడు సరిసా శివ గణేష్, కన్వీనర్ శరగడం వెంకటరమణ, కాండ్రేగుల వెంకటప్పారావు, శరగడం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొత్సకు అభినందన


బొత్సను కలిసిన ఎస్.రాయవరం మండల నాయకులు

ఎస్.రాయవరం: ఎమ్మెల్సీగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులతో పాటు ఎస్.రాయవరం మండలం పలు గ్రామాల ఎంపీటీసీలు, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్ర టైగర్‌గా పేరొందిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ గెలుపు పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం కలిగించిందన్నారు. బొత్సను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పన్న, ఎంపీటీసీ సభ్యులు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, నాగంబోయిన శ్రీనివాసరావు, చొప్పా రాజు, వెదుళ్ల బంగారి, యేజర్ల సీతారామరాజు, చింతలపాటి మణిరాజు, మధువర్మ, వెదుళ్ల బంగారి, బొండా దివాణం, వియ్యపు వరహాలు, బాలం సుబ్బారావు తదితరులు ఉన్నారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు సత్కారం


స్కూల్ కమిటీ డైరెక్టర్లు, చైర్మన్లను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. రాజుపేట స్కూల్ కమిటీ చైర్మన్‌గా టి.శ్రీను, వైస్ చైర్మన్‌గా ఉడికల ఈశ్వరరావు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులుగా గెలుపొందారు. అలాగే పాటిపల్లి మోడల్ స్కూల్ డైరెక్టర్లుగా రాపేటి పరమేష్, దళాయి లక్ష్మి అప్పలరెడ్డి గెలుపొందడంతో ఆదివారం వారిని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో ప్రసాద్ శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ కమిటీ పాలకవర్గ సభ్యులు అనునిత్యం పాఠశాలలు సందర్శించాలన్నారు. అలాగే పిల్లల చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు మద్దాల వీరునాయుడు, ఇల్లా శిరీషా నాగేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, కర్రి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి


వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీనివాసుని ఆలయానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మునగపాకకు చెందిన బుదిరెడ్డి అప్పలనాయుడు-రమాదేవి దంపతుల కుమారుడు, కోడలు ఉదయ-వాణి దంపతులు రూ.55,555 నగదును ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం జరుగుతుందని, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, ఆడారి అచ్చియ్యనాయుడు, వెలగా శ్రీనివాసరావు, జల్లేపల్లి కిష్టప్ప, విల్లూరి మోహన్, ఆడారి కృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాగ్రత్తలతో నేత్రాలు పదిలం


రెటీనా పరీక్షలు చేయించుకుంటున్న డీజీ నాథ్

పాయకరావుపేట : ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ తెలిపారు. ఆదివారం హైమ నేత్రాలయం సహకారంతో స్థానికంగా ఏర్పాటు చేసిన రెటీనా స్క్రీనింగ్ క్యాంపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైమ నేత్రాలయం సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి సీఈవో డాక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా షుగర్, బీపీ, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం వల్ల కంటి సమస్యలతో చాలా మంది బాధపడుతున్నారని అన్నారు. రెటీనా స్క్రీనింగ్ క్యాంపునకు మండలంలో ఉపాధ్యాయులు హాజరై కంటి పరీక్షలు చేయించుకోవడం శుభపరిణామం అన్నారు. డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ షుగర్ వ్యాధి వలన కంటి రెటీనా డిటాచ్మెంట్, రెటీనా హేమరేజ్, డయాబెటిక్ రెటినోపతి వంటి సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఏవీ సూర్యనారాయణ, కార్యదర్శి పి.హరికృష్ణ, ఆర్.వీరభద్రరావు, పి.ఉమామహేశ్వరరావు, టి.తాతారావు, సత్య శ్రీనివాస్, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగా, వ్యాయామంతో ఆరోగ్య సంరక్షణ


ఫిజియోథెరపీ వైద్యురాలు అపర్ణను సత్కరించి మెమెంటో అందజేస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిత్యం వ్యాయామం, యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రముఖ ఫిజియోథెరపిస్టు పీహెచ్ఎస్ అపర్ణ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ గుమస్తాల సంఘం కార్యాలయంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మానవుని జీవనశైలిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడికి వల్లే ఎక్కువగా వ్యాధుల బారినపడే అవకాశాలుంటాయన్నారు. వ్యాధి సోకిన తొలి దశలో వైద్యులను సంప్రదిస్తే త్వరితగతిన నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు అపర్ణను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి యల్లపు సాంబశివరావు, సీనియర్ సభ్యులు శరగడం నూకరాజు, కూండల రామకృష్ణ, దాడి సూరిబాబు, కుమార్, ఆళ్ల ఓంరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఘటాల ఊరేగింపు


అమ్మవారి ఘటాల ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: గ్రామ దేవతల ఉత్సవాలను అందరూ కలిసికట్టుగా సుహృద్భావ వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. స్థానిక కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా అమ్మవారి ఘటాల ఊరేగింపును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న అమ్మవారి ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లు చేసిందన్నారు. ఉమ్మడి విశాఖలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం అమ్మవారి ఘటాలను పట్టణంలోని కోట్నివీధి, మళ్లవీధి, తాకాశివీధి, పెద్ద వీధి, భీమునిగుమ్మం, కొణతాలవారివీధి, సరసా వారివీధి, నాయీబ్రాహ్మణవీధి, లక్ష్మీనారాయణనగర్ మీదుగా ఊరేగింపు నిర్వహించి, అమ్మవారి ఆలయానికి చేర్చారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి


సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న స్వీపర్లు

రోలుగుంట: పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం రోలుగుంటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ ప్రతి నెలా జీతాలు చెల్లించక కుటుంబ పోషణకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సర్వీసు కాలం ఆధారంగా వీరినే పాఠశాల వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. గుర్తింపుకార్డులిచ్చి యూనిఫాం ఇవ్వాలన్నారు. పని ఒత్తిడి తగ్గించాలన్నారు. పెండింగు వేతనాలు సత్వరమే చెల్లించి ఆదుకోవాలనే, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుడు అమృతరావుకు పురస్కారం


అమృతరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

కె.కోటపాడు: చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖపట్నం సెంట్రల్ లైబ్రరీలో ఈ నెల 16న ఎ.కోడూరు హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు జే అమృతరావుకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ ఏపీజే అబ్దుల్ కలాం పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందించారు. సాహిత్యంపై మక్కువతో స్ఫూర్తిదాయకమైన కవితలతో ఆకట్టుకుంటున్న ఉపాధ్యాయుడిని అభినందించారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తి

కె.కోటపాడు: స్వాతంత్ర్య సంగ్రామంలో సుభాష్ చంద్రబోస్ చూపిన పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి తెలిపారు. ఆదివారం చౌడువాడ గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

చిత్తడిగా గిరిజన రోడ్లు

రాకపోకలకు వాలాబు శివారు గ్రామాల గిరిజనుల అవస్థలు


బురదమయంగా మారిన ఇప్పగరువు నుంచి పాతవాలాబు వెళ్లే రహదారి


ఛిద్రమైన వాలాబు వైపు వెళ్లే రహదారి

దేవరాపల్లి: వాలాబు పంచాయతీ శివారు గ్రామాల రోడ్లు చిత్తడి చిత్తడి మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఆయా గ్రామాల మట్టి రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. దీంతో గిరిజనులు తప్పనిసరి పరిస్థితుల్లో ఆయా రహదారుల్లో రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్లన్నీ బురదమయంగా మారడంతో వృద్ధులు, మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. అటుగా వెళ్లే ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనం వెళ్లే పరిస్థితి లేదు. బురద రోడ్లలో ఇప్పటికే పలువురు జారి పడిన సంఘటనలు ఉన్నాయి. ప్రధానంగా ఇప్పగరువు నుంచి పాత వాలాబు వెళ్లే రహదారి మరీ దారుణంగా ఉంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వాలాబు పంచాయతీ శివారు గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మట్టి గణపతినే పూజించాలంటూ అవగాహన ర్యాలీ


మట్టి గణపతి విగ్రహాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆడారి కుమారస్వామి, మహిళలు

అనకాపల్లి: భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు సెప్టెంబర్ 7న జరిగే వినాయక చవితికి మట్టి గణపతులనే పూజించాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకుడు ఆడారి కుమారస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మట్టి గణపతి విగ్రహాలను చేతబట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పర్యావరణాన్ని పరిరక్షించి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాలను విడనాడాలని సూచించారు. మట్టి గణపతులు నదుల్లో, చెరువుల్లో తొందరగా కరిగి పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. పదేళ్లుగా పట్టణ, మండల పరిధిలో వినాయక విగ్రహాలు తయారుచేసే వారి వద్దకు వెళ్లి పీవోపీ బదులు మట్టి గణపతుల తయారీకి ప్రాధాన్యతనివ్వాల్సిందిగా కోరుతున్నట్లు తెలిపారు కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.సోమశేఖర్‌పట్నాయక్, దాడి బుజ్జి, పెంటకోట వరప్రసాద్, కర్రి భరత్, మహిళలు పాల్గొన్నారు.

196 మందికి వైద్య సేవలు


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చెయ్యపేట: వీఎస్సార్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పొట్టిదొరపాలెంలో వైద్య శిబిరం నిర్వహించారు. అనకాపల్లి ఉషాప్రేమ్ ఆస్పత్రి వైద్యులు 196 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరంలో పొట్టిదొరపాలెం, కొత్తూరు, శింగవరం, బుదిరెడ్లపాలెం, గంటికొర్లాం తదితర గ్రామాలకు చెందిన రోగులు తరలివచ్చి వైద్య సేవలు సద్వినియోగం చేసుకున్నారు. వీఎస్సార్ సేవా సంస్థ నిర్వాహకుడు ఒడ్డి సత్యారావు అవసరమైన ఏర్పాట్లు చేశారు.